# లేవండి, మేల్కొనండి!



వివేకానంద మహోపన్యాసాల, రచనల సమాహారం

# లేవండి, మేల్కొనండి!

వివేకానంద మహోపన్యాసాల, రచనల సమాహారం

# శ్రీ వివేకానంద సాహిత్య సర్వస్వం

## మొదటి సంపుటం

శ్రీ రామకృష్ణ మఠము
మైలాపూర్ : : మద్రాసు **600 004**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| శ్రీ వివేకానందస్వామి జీవిత సంగ్రహం | ... | 1 |
| వివేకానందస్వామి - వారి సందేశం | ... | 30 |
| విశ్వమత మహాసభోపన్యాసాలు | ... | 39 |
| జ్ఞానయోగం | | |
| విశ్వమత దర్పణం | ... | 63 |
| విశ్వమత ఆదర్శం | ... | 79 |
| భక్తియోగం | ... | 99 |
| భక్తియోగోపన్యాసాలు | ... | 173 |
| నారద భక్తిసూత్రాలు | ... | 236 |
| యోగాలు - భక్తి | ... | 241 |
| భక్తియోగం | ... | 257 |
| భక్తియోగ పాఠాలు | ... | 263 |
| మాటలద్వారా పనిచేసే భక్తి | ... | 267 |
| దివ్యప్రేమ | ... | 271 |
| ప్రేమ మతం | ... | 281 |
| బాహ్యారాధనం | ... | 285 |
| దివ్యవాణి | ... | 297 |
| అమెరికన్ వార్తాపత్రికలలో నివేదికలు | ... | 398 |

# విజ్ఞప్తి

గతంలో శ్రీ వివేకానందస్వామి రచనల నన్నిటిని 'శ్రీ వివేకానంద సంపూర్ణ గ్రంథావళి' పేరిట పది సంపుటాలలో తెలుగు పాఠకలోకానికి అందివ్వటం జరిగింది. తదనంతరం యీ సంపూర్ణ గ్రంథావళి సంపుటాలను నిర్దుష్టంగా సంస్కరించి, పునఃపరిశీలించి 'శ్రీ వివేకానంద సాహిత్య సర్వస్వం' పేరిట పాఠక లోకానికి అందించాం. దీని బరువు బాధ్యతలను అప్పట్లో శ్రీ దయాత్మానందస్వామి వహించి, సంపుటాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దటంలో శతధా మాకు సహకరించారు. వారికి మా ప్రీతిపూర్వక ధన్యవాదాలు.

ఆధునిక పాఠకుడి సౌలభ్యం దృష్ట్యా గత ప్రచురణలలోని గ్రాంథిక భాషను, సరళ వ్యవహారంలోకి మార్పుచేయటం అనివార్యంగా తోచి, అలా చేయటం జరిగింది. విషయంలో లేశమూ మార్పులేదు. ఈ సంపుటంలోని భాషను సరళ వ్యవహారంలోకి మార్పు చేసి యిచ్చిన శ్రీ ధనికొండ శ్రీధర్‌గారికి మా కృతజ్ఞతలు.

**ప్రకాశకులు.**

# శ్రీ వివేకానందస్వామి జీవిత సంగ్రహం

''అమెరికా సోదర సోదరీమణులారా''- విశ్వమత మహాసభలో హిందూ మత ప్రతినిధిగా పాల్గొన్న వివేకానందు లీ మాటలు ఉచ్చరించిన తక్షణమే ఆ విద్వన్మహాసభలోని ఐదువేలమంది శ్రోతలంతా ఒక్కుమ్మడిగాలేచి మహోత్సాహంతో, మహానందంతో రెండు నిమిషాలపాటు కరతాళధ్వనులు కావించారు. ఆ దివ్యవాణి వారిలో ఒక దివ్యశక్తిగా ఆవేశించింది. ఈ మూడు మాటలతో ధర్మ చక్రం మరొక్కసారి తిరగ ప్రారంభించిం దీ పృథివిలో. 'నరేంద్రుడు బోధిస్తాడు' అని ఎంతోకాలం కింద పల్కిన శ్రీరామకృష్ణవాణి నిరూపితమైం దీ పల్కులతో. ఈ వాక్కులు విశ్వచరిత్రలో - మీదుమిక్కిలి భారతదేశపు చరిత్రలో - ఒక నూతనయుగానికి నాంది పల్కులయ్యాయి. ఇంతకాలం దాదాపు అజ్ఞాతంగాఉన్న వివేకానందసన్న్యాసి ఈ పల్కులతో విశ్వరంగ వేదికలో ప్రవేశించాడు జగద్గురువుగా, లోకోద్ధారకుడుగా, దేశ ప్రేమికుడుగా.

ధర్మం నశించి అధర్మం పెంపొందే సమయాలలో కరుణార్ద్రుడైన పరమేశ్వరుడు మానవుడుగా అవతరించి, కాలానుగుణమైన మార్గాన్ని జనులకు చూపెడతాడనే విశ్వాసం ప్రపంచంలోని మతాలన్నిటిలోను ఉంది. అంతేకాక ఈ మహాపురుషులు తమ అమృత సందేశాన్ని ప్రపంచమంతటా వెదజల్లటానికి సహకరించే ఇతర ఈశ్వర ప్రేరితులను తమతోపాటు తీసుకువస్తారు. ఈ యుగంలో భగవానుడు శ్రీరామకృష్ణుడుగా అవతరించాడు. అంతేగాక తన పనికి సహకరించడానికి ఋష్యంశసంభూతుడైన మరొక జీవిని తీసుకువచ్చాడు. అతడే వారి శిష్యులలో అగ్రగణ్యుడైన వివేకానందస్వామి.

## బాల్యం

స్వాముల బాల్య నామం నరేంద్రనాథ్‌దత్త. ఇతడు ఖ్యాతి చెందిన దత్త వంశంలో జన్మించాడు. భువనేశ్వరీ విశ్వనాథు లితడి తల్లిదండ్రులు.నరేంద్రుడి తాత దుర్గాచరణ్, ప్రఖ్యాతిపొందిన న్యాయవాది. ప్రాపంచిక భోగైశ్వర్యాలు సమృద్ధిగా ఉన్నా ముక్తికాముడై ఇతడు విశ్వనాథుడు పుట్టగానే (తన 25వ ఏట) సన్న్యసించి వెళ్ళిపోయాడు. తండ్రివలె విశ్వనాథుడుకూడ న్యాయవాద వృత్తి నవలం

బించి పేరు ప్రతిష్ఠలేకాక, చాల ధనంకూడ ఆర్జించాడు. ఇతడు విలాసపురుషుడు, పండితుడు, సంగీతప్రియుడు; అన్నిటికంటే మహోదారుడు. ఎంతో మంది బీద చుట్టరికాలను తన ఇంట్లోనే ఉంచుకొని వారిని పోషించటమేకాక, తాగటానికిగాను వారికప్పుడప్పుడు సహాయం చేస్తూ ఉండేవాడు. ఆంగ్లం, పారశీక భాషలలో పాండిత్యాన్ని గడించాడు. ప్రఖ్యాత పండితుల నతడు తన ఇంటికి రావించి వారితో చర్చించేవాడు. అలాగే ఉస్తాదులనుంచి సంగీతం నేర్చుకొని, వారి నప్పుడప్పు డాహ్వానించి మిత్రులతో సంగీతాన్నాస్వాదించేవాడు. అలాగే అతడు మంచి వంటవారిని ఏర్పాటుచేసి రుచికరమైన ఆహారపదార్థాలను వండించి లెక్కలేని మిత్రులతోబాటు ఆరగిస్తూ ఆనందించుచుండేవాడు. ఆ రోజులలో అతని ఇంటి ఖర్చులు నెలకు వేయిరూపాయలకు పైగాఉండేవి. అన్ని విధాలా భర్తకు అనుగుణవతి ఐన సుగుణరాశి భువనేశ్వరీదేవి. ఇతర సుగుణాలతోబాటు ఆమెకు రామాయణం, మహాభారతం, మరెన్నో పురాణకథలు, జానపదకథలు, పాటలు కంఠస్థం. అటువంటిదామె అసాధారణ జ్ఞాపకశక్తి. భగవద్భక్తి, పేదలపట్ల సానుభూతి; అన్ని విధాల పరిస్థితులలోనూ సముచిత రీతిగా నడుచుకొనటం ఆమెకబ్బిన సహజగుణం. ఠీవిగా నడిచేటప్పుడామె మహారాణిగా కన్పించేది. ఇట్టి పుణ్యదంపతులకు పుత్రుడుగా నరేంద్రుడు జన్మించాడు క్రీ.శ.1863-వ సంవత్సరం జనవరి 12వ తేది సోమవారంనాడు. అది పుణ్య మకరసంక్రాంతి దినం. మగసంతానం లేకపోవటంతో భువనేశ్వరి కాశీ వీరేశ్వర శివుణ్ణి అర్చించింది. శివానుగ్రహంగా పుత్రుడు జన్మించాడు. నరేంద్రుడి అల్లరి మితిమీరినప్పుడు 'పుత్రునికోసం ప్రార్థించితే భూతాన్ని పంపించాడు శివు' డని ఆప్యాయంగా హాస్యంచేసేది తల్లి.

వీరేశ్వర ప్రసాదలబ్ధు డవటంచేత 'వీరేశ్వరు'డని పేరుపెట్టారు బాలుడికి. ముద్దుగా 'బీలే' అనీ, తర్వాత 'నరేంద్రుడు' 'నరేన్' అనీ పిల్చేవారు. చివరి కీ పేరే నిల్చిపోయింది.

నరేన్ అసమాన ప్రతిభావంతుడైన బాలుడు. రూపంలోను, గుణంలోను, శక్తిసామర్థ్యాలలోను అతడి కతడేసాటి. ఆతడి రమణీయ శరీరం, మధురకంఠం అందరినీ మంత్రముగ్ధుల్ని చేసేవి. చిన్ననాటినుండీ వ్యాయామం, కుస్తీ, సాము, ఈత ఇత్యాదులతో శరీరాన్ని దృఢంచేసుకున్నాడు నరేన్. భయం అంటే తెలియదు నరేన్‌కు. సమయస్ఫూర్తి అత్యంత మెప్పొందింది అతడిలో. అసామాన్య మేధావి, ఏకసంధాగ్రాహి కావటంతో చాల త్వరగా అతడు తన పాఠాలను పూర్తి చేసుకొని తక్కిన సమయాన్ని ఇతర పుస్తకాలతో, ఆటపాటలతో, మిత్రులతో, వినోదాలతో గడిపేవాడు. సంగీతాన్ని విద్వాంసులనుంచి పాడటం, వాయించటం

ఇత్యాదిని చక్కగా నేర్చుకున్నాడు. గంధర్వనిందిత అతడి మధురకంఠం - పాటలైనా, మాటలైనా, సంభాషణలైనా, ఉపన్యాసాలైనా, శ్రోతల మనస్సుల నరికట్టి మరో లోకానికి కొనిపోయేది. చిన్ననాటినుంచీ నరేన్ ధైర్యసాహసాలు సువిదితమయ్యాయి. పరిస్థితులెంత భయావహాలైనా పారిపోక, నిల్చి ఎదుర్కొన్న ఘటనలతడి జీవితంలో ఎన్నో. తన యుక్తితో విమర్శించకుండ అతను ఎవరి మాటలను లక్ష్యం చేసేవాడు కాదు. ఒక ఉదాహరణ: స్నేహితులతో కలిసి పక్కింటిలోని చెట్టుకొమ్మ లెక్కి తలకిందుగా ఊగులాడటం నరేన్‌కు చాల ఇష్టం. ఆ ఇంటి ముసలాయనకది గిట్టదు. వారిని భయపెట్టడానికి, ''ఆ చెట్టుమీద బ్రహ్మరాక్షసి ఒకటుంది. చెట్టెక్కినవారి గొంతును అది నులుముతుంది'' అని చెప్పాడు. స్నేహితులందరూ పారిపోయినా నరేన్ యథాప్రకారం అలాగే ఊగులాడసాగాడు. ''మీరు ఒట్టి బుర్ర లేనివాళ్ళు. బ్రహ్మరాక్షసే ఉంటే ఇదివరకే మన ప్రాణాలు పొయ్యేవికావా?'' అని వారి నెగతాళి చేసాడు. అన్ని సందర్భాలలోనూ అదే వ్యవహారం. అటువంటి దతని యౌక్తికోత్పత్తి.

నరేన్‌కు చిన్నప్పటినుంచి ధ్యానం అంటే మహాఇష్టం. పగలంతా మిత్రులతో కలిసి ఆటపాటలతో గడిపినా రాత్రివేళ ధ్యానం అభ్యసించేవాడు. ఈ విధంగా గడిచిన రాత్రులెన్నో. ఆ ధ్యానావస్థలో అతనికొక విచిత్రానందం కల్గేది. అన్నిటికంటే అతడి పవిత్రశీలం, సత్యసంధత, భగవద్భక్తి అందరినీ ఆకర్షించేవి. శ్రీరామకృష్ణు లతణ్ణి 'నా శుకు' డని ప్రేమతో పిలుస్తూ ఉండేవారు. రామాయణం, మహాభారతం, పురాణకథలు అతడికి ఉగ్గుపాలతో పోసింది తల్లి. ఫలితంగా ఇవంటే అతనికెంతో ప్రీతి. తల్లి ఇచ్చిన డబ్బుతో సీతారాములు, శివుడు, ఆంజనేయుడు ఇత్యాది బొమ్మలను కొని, వాటిని అలంకరించి ధ్యానిస్తూ వుండేవాడు.

నరేన్ ఒక విచిత్రావస్థలో నిద్రపోయేవాడు. రోజు అతడు పడుకోగానే ఒక జ్యోతి కన్పించేది. దాన్నే తదేకంగా చూస్తూ, దాన్లో లీనుడై నిద్రించేవాడు. నరేన్ పెరిగేకొద్దీ క్రమంగా ఈ జ్యోతి ఒక భవిష్యదాదర్శరూపంగా మారసాగింది. అతని కళ్లముందు రెండు ఆదర్శాలు కన్పించేవి 1. ప్రాపంచిక భోగాదర్శం 2. సర్వసంగ సన్న్యాసాదర్శం. చివరకు సన్న్యాసాదర్శమే అతని మనస్సు నావేశించగా, అతడు నిద్రపోయాడు. అంటే అతడి కజ్ఞాతంగానే ఈ ఆదర్శమతడి జీవితాన్ని చిన్ననాటినుండే రూపొందించ సాగిందన్నమాట. నేను పెరిగి తాత మాదిరి ఒక మహాసన్న్యాసినౌతానని అతడు తరచు స్నేహితులతో చెప్పేవాడు. నిజమే గదా! భౌతికంగా, బౌద్ధికంగా, ఆధ్యాత్మికంగా నరశ్రేష్ఠుడతడు; అందుకే సమగ్ర మానవానీకాని కతడు నరశ్రేష్ఠ ప్రతీకుడు.

క్రమంగా నరేన్ పాఠశాల చదువు ముగించి కళాశాలలో చేరాడు. ఇక్కడ కూడ అత్యల్పసమయంలో తన పాఠ్యపుస్తకాలను ముగించి ఎక్కువకాలం ఇతర పుస్తకాలను చదివేవాడు. చరిత్ర, తత్త్వశాస్త్రం అంటే నరేన్‌కు చాలఇష్టం. ప్రాచ్య, పాశ్చాత్యచారిత్రక, తాత్వికశాస్త్రాలపై రచింపబడ్డ ప్రామాణిక గ్రంథాలను నిశిత బుద్ధితో చదివాడు; వాటిలోని లోపాలను గుణాలను సమన్వయదృష్టితో చదివి చక్కగా అర్థం చేసుకోగల్గాడు. కనుకనే తర్వాత అతడు భారతదేశం అంతా తిరిగి చూసి, దానిని గూర్చిన ఒక సమగ్రచిత్రాన్ని పొంది, దానిలోని లోటుపాటులను అర్థం చేసుకొని, దాని అవనతికి కారణాలను గ్రహించి, భవిష్యత్తులో మన ఈ దేశం మహోజ్వలంగా వెల్గాలంటే ఏమిచేయాలో సూచించగల్గాడు. నరేన్ 1881లో ఇంటర్ ముగించి బి.ఎ.లో చేరి 1884లో పట్టభద్రుడయ్యాడు.

యువ నరేన్ కళాశాలలో చదువుతున్నప్పటి సంగతి. ఈ సమయంలో ప్రఖ్యాత బ్రహ్మసమాజ నేత ఐన కేశవచంద్రసేన్ ఉపన్యాసాలను విని ఆకర్షితులై ఆ సమాజంలో సభ్యులుగా చేరారు ఎంతోమంది వంగ యువకులు. నరేన్‌కూడ ఈ సమాజంలో సభ్యుడై దాని ప్రార్థనాది కార్యక్రమాలలో పాల్గొనేవాడు. దేవుడు రూపంలేనివాడైనా, అశేష కల్యాణ గుణనిధి అనేది బ్రహ్మసమాజపు నమ్మకాలలో ఒకటి. నరేన్ తదనుసారంగా ధ్యానం అభ్యసించసాగాడు. అతనిలో ఇప్పుడు దేవుణ్ణి చూడాలనే కోరిక తీవ్రం కాసాగింది. దానికోసం అతడు నాటి ప్రఖ్యాత మతనాయకులందరినీ దర్శించి, 'మీరు దేవుణ్ణి చూసారా?' అని ప్రశ్నించసాగాడు. అందరినుండి అతనికి లభించింది ఒకే ఒక్క సమాధానం, 'లేదు' అని. ఇలాటి సమయంలో శ్రీరామకృష్ణులతో సమాగమమైంది నరేన్‌కు.

## శ్రీరామకృష్ణులతో సమాగమం

శ్రీరామకృష్ణులు కలకత్తాకు 4 మైళ్ళ దూరంలో ఉన్న దక్షిణేశ్వరం అనే ఒక చిన్నగ్రామంలో రాణి రాసమణి నిర్మించిన భవతారిణీ అనే కాళీమందిరంలో పూజారిగా చేరి, 12 సంవత్సరాలు అమానుషిక తపస్సుచేసి వివిధ మతాల, విభిన్న మార్గాల ద్వారా విభిన్నరూపాల భగవద్దర్శనం పొందిన మహాపురుషుడు. తర్వాత శ్రద్ధాళువులైన దర్శనార్థులకు, సాధకులకు, భక్తులకు ఆయన తమ అనుభవాలను చెప్తూ వారుకూడ భగవద్దర్శనం పొందగల్గే మార్గాలను చూపసాగారు. కేశవసేన్‌కూడ వీరిని దర్శించి, ఆకర్షితుడై తరచు వారి సాంగత్యాన్ని పొందసాగాడు. శ్రీరామకృష్ణుల సహజ, సరళ, సుందర బోధామృతాన్ని తన ఉపన్యాసాలలోను, పత్రికలలోను ప్రకటించసాగాడు. ఈ విధంగా బ్రహ్మసమాజం

ద్వారాను, తన కళాశాల అధ్యక్షుడైన విలియమ్ హేస్టునుండి శ్రీరామకృష్ణులను గూర్చి విన్నాడు నరేన్. దేవుణ్ణిగూర్చి పెద్దపెద్ద ఉపన్యాసాలనిచ్చే నాయకులను దర్శించి నిరుత్సాహితుడైన నరేన్‌ను చూసి అతడి మామ, శ్రీరామకృష్ణుల ప్రముఖ గృహస్థ శిష్యుడూ ఐన రామచంద్రదత్త అతడితో ఇలా అన్నాడు: ''చూడు, నరేన్ నీకు నిజంగానే భగవద్దర్శనం కావాలని కోర్కె ఉంటే ఇక్కడ, అక్కడ తిరగొద్దు, శ్రీరామకృష్ణులను దర్శించు.'' త్వరలో అనుకోకుండా ఈ సమావేశం జరిగింది.

శ్రీరామకృష్ణు లొక రోజు తమ భక్తుడైన శ్రీసురేంద్రనాథమిత్ర మిత్రుని ఇంటికి వచ్చారు. ఆ సందర్భంలో మధురగాయకుడుగా పేరుపడ్డ నరేన్ ఆహ్వా నింపబడ్డాడు, భక్తిగీతాలను పాడటానికిగాను. ఆ రోజు అంతర్ముఖుడై తన మనో వేదనను వ్యక్తపరచే ''ప్రభూ! నా జీవితపు దినాలన్నీ వ్యర్థంగానే గడిచిపోతవా'' - ''ఓ మనసా! నీ స్వదేశానికి తిరిగిపో'', అనే రెండు పాటలను గానంచేసాడు. పాటలను విన్న శ్రీరామకృష్ణులు భావావేశాన్ని పొందారు. మొదటి కలయికలోనే ఆయన నరేంద్రుణ్ణి 'తన శిష్యుడు, తన జీవితకార్య సహకారుడు' అని గ్రహించి ఆప్యాయంగా ఆహ్వానించారు దక్షిణేశ్వరానికి రమ్మని.

కొంతకాలం తర్వాత నరేన్ దక్షిణేశ్వరానికి పోయి ముక్కుసూటిగా శ్రీ రామకృష్ణుల నడిగాడు, 'మహాశయా, మీరు దేవుణ్ణి చూశారా?' అని. 'ఔను, నాయనా చూశాను, నేను నిన్నెంత దగ్గరగా చూస్తున్నానో అంతకంటే సన్నిహి తంగా చూశాను. అంతేకాదు నీకూ చూపించగలను. చూస్తావా?' అని అతణ్ణి తాకారు. ఆ స్పర్శ ఫలితంగా ఒక అద్భుతానుభూతి కల్గిందతనికి; సమస్త విశ్వం శూన్యంలో లీనమౌసాగింది. అది అతడిలో అత్యంత భయాన్ని రేకెత్తించింది. నరేన్ పవిత్ర పాత్రుడైనా ఈ చరమానుభూతి కతని సన్నాహం పూర్తికాలేదని గ్రహించి, తిరిగి అతణ్ణి తాకి యథాస్థితికి తీసుకువచ్చారు శ్రీరామకృష్ణులు. శ్రీ రామకృష్ణుల ప్రభావాన్ని, ప్రవర్తనను చక్కగా పరిశీలించి ఆతడు భగవత్సాక్షా త్కార సిద్ధుడనీ, ఆధ్యాత్మికక్షేత్రంలో అతడికి సాటియైనవారు మరొకరు లేరనీ అటువంటి మహాపురుషులు సమస్త విశ్వంలోనూ చాల అరుదనీ అర్థం చేసుకో గల్గాడు నరేన్. ఐనా శ్రీరామకృష్ణుల జీవితాన్ని, ఉపదేశాలను చక్కగా తన యుక్తితో పరీక్షించకుండా ఆయన్ను అంగీకరించడానికి సిద్ధపడలేదు నరేన్; హృదయం నమ్మినా, తన బుద్ధి అంగీకరించనంత కాలం వారిని నమ్మటానికి, గురువుగా స్వీకరించటానికి సిద్ధంగా లేడతడు. అందుకే దీనికతనికి దాదాపు ఐదు సంవత్సరాల కాలంపట్టింది. తర్వాతనే అతడు శ్రీరామకృష్ణుల పాదపద్మాల దగ్గర తన జీవితసర్వస్వం అర్పించి వారి ఆజ్ఞను తలదాల్చటానికి సిద్ధపడ్డాడు.

# కొన్ని విశేషాలు

శ్రీరామకృష్ణులు భగవదవతారం; వివేకానందుడు ఈశ్వరాంశసంభూతుడు, వారి జీవితకార్యానికి సహకరించటానికి జన్మించినవాడు అని ఎంతోమంది భక్తుల నమ్మకం. ఐనప్పుడు శ్రీరామకృష్ణు లివ్వదల్చిన అనుభూతి నతడు మొదటనే గ్రహించటానికి అనర్హు డెలా అయ్యాడు? శ్రీరామకృష్ణులను అంగీకరించటాని కతడి కన్ని సంవత్సరాలు ఎందుకు కావలసివచ్చింది? దైవాంశుడికే దేవుడిలోనే ఒకప్పుడు నమ్మకం పోయిన దెందుకు? ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలను పొందిన తర్వాతనే వివేకానందుల జీవితం, సందేశరహస్యం కొంచెం అర్థం కాగలదు మనకు. ఐనా అతిసంక్షిప్తంగానే సూచించగలం ఇక్కడ ఈ ప్రశ్నలకు ఉత్తరం.

మానవ జన్మయొక్క ఉద్దేశాన్ని మరొక్కసారి మానవానీకానికి బోధించి, ఆ గమ్యం చేరటానికై కాలోపయోగమార్గాన్ని చూపెట్టటం అవతారోద్దేశం. ఇది యౌక్తికయుగం వైజ్ఞానికయుగం; విశ్వాసయుగం కాదు. అంటే ఈనాటి మనుషులు ప్రతిదానికి 'ఎందుకు? ఎలా! దీనికి ప్రమాణమేమిటి?' అని ఆరా తీస్తారు. ప్రతి విషయాన్ని యుక్తితో విమర్శించి, అది యుక్తియుక్తం అని తేలిన మీదటనే గ్రహిస్తారు. అంతేగాక దీనివలని ప్రయోజనం ఏమిటి? అని తెలుసుకోగోరుతారు. వివేకానందుడు ఇటువంటి మనస్తత్వ మానవులకు ప్రతీకుడు. దేవుడున్నాడా? ఉంటే ప్రత్యక్ష దర్శనమే దానికి ఋజువు, ప్రమాణం. అతని తత్త్వం, స్వరూపం ఏమిటి? పెద్దలు చెప్పారని కాక, పుస్తకాలలో రాయబడిన దనికాక ఈ విషయాలు యుక్తికాలా? లేదా విరుద్ధాలా? అని పరీక్షించి యుక్తికి విరుద్ధ విషయాలను దూరంగా పారవేయాలి. అలాగే దేవుడున్నాడనే నమ్మకం లేనివారు కొందరు (నాస్తికులు), దేవుడున్నా అతణ్ణి గూర్చి తెలుసుకోవటం అసంభవం అన్న అభిప్రాయం గలవారు మరికొందరు (అజ్ఞేయవాదులు) ఈ లోకంలో ఉన్నారు. మరి వారు ఇటువంటి అభిప్రాయం కలిగి ఉన్నవారైనా వారు కూడ జీవితలక్ష్యం అంటే ఆత్మసాక్షాత్కారం పొందాలి. వారి కనుగుణమైన మార్గాన్ని వారికి చూపించాలి. విగ్రహారాధన ఇత్యాదివన్నీ ఒట్టి మూఢనమ్మకాలు అని కొందరి ఉద్దేశం. అది నిజమా? కాకపోతే దీనివెనుక ఉన్న మర్మం ఏమిటి? అసలు మనమంటే ఏమిటి? విభిన్న మతాలు, లెక్కలేని మతశాఖలు ఎందుకున్నాయి? మా మతమే సత్యం, మీది అసత్యం అని పోరాడేదాన్లోని నిజం ఏమిటి? ఇటువంటి ప్రశ్నల కన్నిటికీ సరైన సమాధానాలు లభించితేనేగాని వివేకానందుడు మనుషులందరికీ అనువైన మార్గాన్ని చూపెట్టజాలరు. శ్రీరామకృష్ణులు అవతారపురుషులు. ఐనా వారు సామాన్య మానవుని మాదిరి రకరకాల

సాధనలు చేశారు, ఎన్నోరీతుల భగవంతుణ్ణి దర్శించారు. కాబట్టే వారి మాటల కంత సత్యత, ప్రామాణికత ఉంది. అలాగే వివేకానందుడుకూడ సాధారణ మను షుల మనోవృత్తుల నవలంబించి వారి మనస్తత్వాలను చక్కగా అర్థం చేసుకో గల్గాడు. కనుకే వారికికూడ తగిన మార్గాన్ని చూపెట్టగల్గారు స్వానుభవంనుంచి సప్రామాణికంగా.

## సాధన, పరివర్తన, వికాసం

నరేన్ ఇప్పటినుంచి తరచు దక్షిణేశ్వరానికి వచ్చి శ్రీరామకృష్ణుల సాంగ త్యాన్ని, మార్గదర్శకత్వాన్ని పొందసాగాడు. అతడు మూడవసారి వచ్చినప్పుడు గురుదేవులతణ్ణి స్పృశించి సమాధిస్థితుణ్ణి చేసి అతడి పుట్టుపూర్వోత్తరాలు కన్గొని నరేన్ లోకోద్ధరణకై జన్మించిన ఋష్యంశసంభూతుడనే తన పూర్వాభి ప్రాయాన్ని రూఢి చేసుకున్నాడు. కాలక్రమేణ శ్రీరామకృష్ణులకు సన్నిహితు డౌతున్నకొద్దీ ఆయనపై గౌరవం, ప్రేమ, భక్తి ఇతోధికం కాసాగింది నరేన్‌కు. గురుదేవుల ఉపదేశాలు, వారి దైనందిన జీవితంలోని గభీరాంతరార్థం ఒకింత అర్థం చేసుకొని ఆశ్చర్యచకితుడు కాసాగాడు. బ్రహ్మసమాజ సభ్యుడుగా విగ్రహా రాధన నతడు ఏవగించుకొనేవాడు. కాని సాధనాపథంలో ఇదెందరకో చాల సహా యకారి అనీ, అంతేకాక నూటికి తొంభైతొమ్మిది శాతం సాధకులకు అనివార్య మనీ గురుదేవుల అనుగ్రహంతో త్వరలోనే గ్రహించాడు. ఈ కాలంనుంచి తన తోపాటు బ్రహ్మసమాజంలో చేరిన కొంతమంది యువకులు, బయటనుంచి మరికొందరు శ్రీరామకృష్ణులచే ఆకర్షితులై తరచు దక్షణేశ్వరానికి వస్తూ తీవ్ర సాధనలు చేయసాగారు. ఇటువంటి పదహారుగురు శిష్యులతో కూడినదై భవిష్యద్ శ్రీరామకృష్ణ సంఘం స్థాపింపబడింది. వీరి కందరికి నాయకుడు నరేంద్రుడే. ఆటలతో పాటలతో నరేన్ వీరందరికీ అత్యంతప్రోత్సాహం ఇస్తూ ఉండేవాడు. వీరందరిలోనూ కుశాగ్రబుద్ధి మహాశక్తివంతుడు నరేన్. తన సందేశామృతాన్ని ప్రపంచమంతటా వెదచల్లటానికే నరేంద్రుడి జన్మ అని మొదటినుంచీ గ్రహించిన గురుదేవు లతనికి అద్వైతతత్త్వంలో తర్ఫీదు ఇవ్వసాగారు. అన్ని రంగాలనుంచి ఏకత్వం వైపుకు ముందంజ వేస్తూన్న ఈ యుగానికి భవిష్యన్మతం అద్వైత వేదాంతమే. బౌద్ధికంగా, వైజ్ఞానికంగా, యౌక్తికంగా నేటి మనుష్యులచే స్వీకరింపబడగల్గే ఏ సిద్ధాంతమైనా ఉంటే అది ఒక్క అద్వైతం మాత్రమే. ''మతం, కళ, విజ్ఞానం - ఈ మూడు ఒకే సత్యం యొక్క విభిన్న అభి వ్యక్తనలు. కాని దీన్ని అర్థం చేసుకోవాలంటే అద్వైత సిద్ధాంతం అవసరం'' అన్నాడు తర్వాత వివేకానందుడు. మొదట అద్వైత సిద్ధాంతాన్ని అవహేళన

చేశాడు నరేన్. కాని గురుదేవుల ఒకనాటి స్పర్శతో అతడి మనస్సు భావస్థితిని చెంది అద్వైతానుభూతిని ఒకింత చవిచూసి, అది నిజమని ఒప్పుకొని, దాన్ని పొందటానికి తహతహలాడసాగాడు. ఈ చరమానుభూతికై శ్రీరామకృష్ణు లతణ్ణి సక్రమంగా సిద్ధం చేయసాగారు. వారి మార్గదర్శకత్వం కింద వివిధ సాధనలు చేస్తూ అతడు ఆధ్యాత్మికంగా అగ్రేసరుడు కాసాగాడు.

## క్లిష్టదశ : గుణపాఠాలు

1884వ సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీ నరేంద్రుడి జీవితంలో ఒక కొత్త మైలురాయి. నరేన్ వయస్సప్పుడు 22 సంవత్సరాలు. ఒక నెల క్రితం అతడు బి.యే. పరీక్ష వ్రాసి, పట్టభద్రుడయ్యాడు. ఆనాడతడి తండ్రి విశ్వనాథుడు హృద్రోగానికి గురై హఠాత్తుగా చనిపోయాడు. ఇంతకాలం చీకూచింతా లేకుండా నిశ్చింతగా బ్రతుకుతున్న అతడి జీవితం తారుమారైంది. ప్రపంచంలోని స్వార్థ పరత, క్రూరత, నిర్దాక్షిణ్యం అతడి కింతకాలం అర్థంకాలేదు. తండ్రి మరణంతో కుటుంబ బాధ్యత అంతా అతనిపై పడింది. ఇంతకాలం తండ్రి పోషిస్తూన్న బంధువు లిప్పుడు శత్రువులై అతడి ఇల్లుకూడ తమదే అని ఇంటివారిని గెంటి వేశారు. ఇంతకాలం మిత్రులుగా చెలామణి అవుతున్నవారు పరాయివారై నరేన్‌కు సహాయం చేయటానికి చిన్నవేలైనా ఎత్తటానికి సిద్ధంకాలేదు. నరేన్ భోజనం లేకుండా, చిరిగిన బట్టలతో, చెప్పులతో ఉద్యోగంకోసం వెదికి వెదికి వేసారి పోయా డెన్నో రోజులు. అసహాయులైన బీదలు, పేదలు ఈ క్రూరసంసారంలో పడే బాధ ఎంతో ఒకింత అర్థమైంది నరేన్ కిప్పుడు. అచిరకాలంలో పరివ్రాజ కుడుగా దేశమంతా తిరిగి శతాబ్దాలనుంచి అసహనీయ దుఃఖాల ననుభవిస్తూ తమ వ్యక్తిత్వాన్ని కోల్పోయి దాదాపు తుల్యులైన తన అసంఖ్యాక దేశీయుల దుస్థితి అతడి హృదయాన్ని అపారసానుభూతితో నింపి, వారి దుస్థితికి కారణం, దాని నివారణోపాయాన్ని వెదకించి, అతణ్ణి పాశ్చాత్యదేశాలకు పంపించిం దీ కాలపు స్వానుభవమే. చిన్ననాటినుంచి భగవంతుడిలో అచంచల విశ్వాసం ఉండే దతడికి. పరమదయాసముద్రుడైన భగవంతుడి రాజ్యంలో అసహనీయమైన క్రూరం, దుఃఖం ఉండటం ఎలా సాధ్యం? అనే ప్రశ్న అతడి మెదడును కలత పరచి, విశ్వాసాన్ని ఊడద్రోలింది. ఈ ఉద్రేక మనోస్థితిలో అతనికొక అద్భుత మైన ఆధ్యాత్మికానుభూతి కల్గింది. తద్వారా కరుణ, క్రౌర్యం ఏకకాలంలో ఉండటం సంభవం అని గ్రహించాడతడు. ఈ కష్టకాలంలోనే అతడు కొంత కాలం 'నాస్తికుడు' గా మారాడు. ఇంత చివరి కతడు శ్రీరామకృష్ణుల ఆరాధ్య దేవత ఐన కాళికాదేవిని స్వీకరించటానికి నిరాకరించాడు. కాని తల్లి, తమ్ముల

కష్టాలను చూడలేక, శ్రీరామకృష్ణులను ప్రార్థించి వారి కృప వలన 'కాళీ' దర్శనాన్ని పొంది దేవుడు 'సాకారుడుకూడ' అనే సత్యాన్ని గ్రహించాడు. ఇంతటితో అద్వైతానుభూతి నొసగి 'నిర్వికల్ప' సమాధిని పొందటానికి ఎదురౌతున్న విఘ్నాలు తొలగిపోయాయి. ఆధ్యాత్మిక జీవితంలో గురువు లేకుండా అగ్రేసరుడవటం దాదాపు అసంభవమని గ్రహించాడు; శ్రీరామకృష్ణులను హృత్పూర్వకంగా గురువుగా స్వీకరించాడు. దేవుడు సాకారుడు, నిరాకారుడు, ఈ రెండింటికి అతీతుడని గ్రహించాడు; అంతేకాక దేవుణ్ణి నిరాకారుడిగా భావించటం చాల కష్టమని, దాదాపు అందరికీ విగ్రహారాధన, ప్రతిమోపాసన అత్యంతావశ్యకం అనికూడ గ్రహించాడు. ఈ అనుభవాలద్వారా నరేన్ మనసిప్పుడు నిస్సంశయమై భక్తితో నిండి అద్వైతానుభూతికి కావలసిన సిద్ధతను పొందింది.

## గురుదేవుల వ్యాధి - నిర్యాణం

శ్రీరామకృష్ణుల జీవితం సమాప్తం కాసాగిందిప్పుడు. ఆయన గొంతులో 'క్యాన్సర్' వ్యాధి బయలుదేరి క్రమంగా వృద్ధికాసాగింది. చికిత్సానుకూలంకోసం, వైద్యుల సలహామేరకు భక్తులు వారిని కలకత్తాలోని 'కాశీపూర్'కు తరలించారు. వారి గృహస్థభక్తులు బయటపని చూస్తూంటే నరేంద్రుడు నాయకుడుగా సోదర శిష్యులు వారి సేవాశుశ్రూషను చేయసాగారు. ఈ వ్యాధికి చికిత్సలేదని తెలిసిన నరేన్ సోదరశిష్యులతోపాటు తీవ్రజపధ్యానాలు చేయసాగాడు.

శ్రీరామకృష్ణులిప్పుడు క్రమంగా క్షీణిస్తూన్న తమ యావచ్ఛక్తిని తన శిష్యులలో త్యాగవైరాగ్యాలను ప్రజ్వలించటానికి, భవిష్యత్తులో కానున్న సన్న్యాసి సంఘాన్ని నిర్వహించటానికి కావలసిన విధానాన్ని నరేన్‌కు బోధించటానికిగాను వినియోగించసాగారు. నరేంద్రుడి మనస్సిప్పుడు 'నిర్వికల్ప' అనుభవానికి తహతహలాడసాగింది. గురుదేవుల కృపతో ఈ అనుభవం లభించిందతని కొకరాత్రి కాశీపురంలో. తర్వాత వారతణ్ణి పిలిచి, ''ఈ అనుభవం ఇక నీకిప్పుడు కలుగదు. ప్రపంచంలో ఒక మహత్తరకార్యాన్ని సాధించటానికే నీ జన్మ. నీ ఆ జీవితకార్యం ముగిసిన తర్వాతనే మళ్ళీ ఈ అనుభవం లభిస్తుంది నీకు,'' అని చెప్పారు. నరేన్ 'ఆచార్యుడు' కావటానికి అప్పుడు ఒప్పుకొనకపోయినా చివరి కదే నిజమైంది. శ్రీరామకృష్ణులు దేహత్యాగాన్ని చేయడానికి రెండు, మూడు రోజులకు మునుపు వారతన్ని ఏకాంతంగా పిలిచి తమ తపశ్శక్తినంతా అతనికి ధారపోసారు, లోకసేవలో అతనిచే ఉపయోగించబడటానికై. ఈ రోజులలో శ్రీరామకృష్ణుల దేహం చాలక్షీణమై మంచంమీదనే ఇటునుంచి అటు తిరిగే శక్తికూడాలేక చాల బాధపడసాగారు. తాను అవతార పురుషుణ్ణని శ్రీరామకృష్ణులు మునుపు నరేన్‌తో ఎన్నో

సార్లు చెప్పారు. కాని అతనిలో నమ్మకం కలగలేదు. ఒక రోజు ఇటువంటి కష్ట స్థితిలో శ్రీరామకృష్ణులను చూసి తనలోతానిలా అనుకొన్నాడు: ''ఈ స్థితిలో వీరు తా మవతార పురుషులని చెప్తే నమ్మగలను.'' తక్షణమే తమ యావచ్ఛక్తిని కూడదీసుకొని క్షీణస్వరంతో శ్రీరామకృష్ణు లతడితో ఇలా అన్నారు: ''ఓ నా నరేన్! ఇప్పటికీ నీ సందేహం తీరలేదా? ఎవడు రాముడో, ఎవడు కృష్ణుడో అతడే ఇప్పుడు శ్రీరామకృష్ణుడుగా అవతరించాడు. కాని నీ వేదాంత దృష్టిపరంగా కాదు సుమా!'' నరేంద్రుడి సందేహం చిరతరంగా తీరిపోయింది. శ్రీరామకృష్ణుల జీవితకార్యం సమాప్తమైంది. 1886 వ సంవత్సరం ఆగస్టు 16వ తేదీన మహా సమాధిని పొందారు.

## నరేన్ నేర్చిన విశేషాలు

శ్రీరామకృష్ణుల దివ్యసాంగత్యంనుంచి నరేన్ నేర్చిన ముఖ్యాంశా లివి:

1. మానవ జీవితలక్ష్యం భగవత్సాక్షాత్కారం లేదా ఆత్మ సాక్షాత్కారం. మానవ జీవితం అర్థవంతమయ్యేది దీనివలననే.

2. మతం అంటే మాటలు, నమ్మకాలు, సిద్ధాంతాలు కాదు. మతం అంటే సాక్షాత్కారం, ప్రత్యక్షానుభవం. అన్ని మతాలు సత్యమే. అన్నీ శ్రద్ధావంతులైన సాధకులను గమ్యానికి చేర్చే మార్గాలవంటివి. విభిన్నమతాలు, మతశాఖలు విభిన్న మనస్తత్వాలకు సరిపడే మార్గాలు. అన్ని మతాల అంతఃసారం ఒకటే. మతాల మధ్య ఎదురయ్యే మనస్పర్థలు, సంఘర్షణలు మతాల బాహ్య క్రియా కలాపాలలోని తేడాను గూర్చే. మతానికి యుక్తిగా ఎటువంటి సంఘర్షణాలేదు.

3. కనుక ఎంత హేయంగా కన్పించినా ఏ మతశాఖనూ ద్వేషించకూడదు. ఎందుకంటే అది ఒకానొక సమయంలో ఎవరికో ఒకరికి తోడ్పడగల్గుతుంది కాబట్టి.

4. ఆంతరంగికంగా ఐనా సరే బాహ్యకంగా ఐనా సరే ఈ ప్రపంచాన్ని త్యాగం చేయకుండా ఎవరూ ఆధ్యాత్మికతను పొందలేరు. సాధనలోని పెద్ద ఆటంకాలు - కామ కాంచనాలు.

5. ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం, - ఇవి మతశాఖలు కావు, మతమనే యాత్రలోని మూడు మజిలీలు; సాధకుల మనస్సుయొక్క మూడు దశలు లేదా అవస్థలు. ప్రతి సాధకుడు (ఏ మతస్థుడైనా సరే) ద్వైతంనుంచి మొదలుపెట్టి, విశిష్టాద్వైతస్థితికి చేరి చివరికి గమ్యమైన అద్వైతస్థితికి చేరాలి. ఈ అద్వైతానుభ వానికే ముక్తి, నిర్వాణం, సమాధి, కైవల్యం, దైవసాక్షాత్కారం ఇత్యాదిగా ఎన్నో పేర్లు.

6. శ్రీరామకృష్ణుల జీవితం ఈనాటి మానవులకు ఆదర్శస్వరూపం. సర్వయోగ, సర్వమత సమన్వయం. దైహికంగా, బౌద్ధికంగా, ఆధ్యాత్మికంగా అన్ని విధాలా సర్వతోముఖ వికాసమే ప్రతి మానవుడి లక్ష్యం, కర్తవ్యం, ఆదర్శమున్నూ.

7. బాహ్యవస్తువులను ఒకడు ఇంకొకడికి ఇవ్వగల్గినట్లు శక్తివంతుడైన మహాపురుషుడు అధ్యాత్మికశక్తినికూడ అలాగే యుక్తులైన పాత్రులకు ఇవ్వగలడు. ప్రచారమంటే నిజంగా ఈ శక్తిని ఇవ్వగలగటమే. ఉత్త ఉపన్యాసాలు కావు. శ్రీరామకృష్ణులు చేసిన దిదే.

(తర్వాతికాలంలో వివేకానందుడు చేసిన దీ శక్తి వితరణమే)

## నిర్యాణానంతరం : బారానగర మఠం

శ్రీరామకృష్ణుల నిర్యాణానంతరం నరేంద్రాది శిష్యులందరూ తమతమ ఇళ్లకు తిరిగిపోయారు. కాని త్వరలోనే 'బారానగరం'లో ఒక పాత ఇంటిని అద్దెకు తీసుకొని దాన్ని మఠంగా మార్చారు. 'వీరందరూ త్యాగులుగానే ఉండే బాధ్యత నీది' అనే శ్రీరామకృష్ణుల ఆదేశాన్ని తలదాల్చి వారి నందరినీ ప్రోత్సహించి మఠంలో చేర్చాడు నరేన్. అక్కడ వారందరూ గురుదేవుల త్యాగాదర్శ భావోద్దీప్తులై కఠోరమైన తపస్సును చేయసాగారు. కొన్ని నెలలోనే వారందరూ శాస్త్రోక్తంగా సన్న్యాసం స్వీకరించి, సరికొత్త పేర్లు పెట్టుకున్నారు. నరేంద్రుడు సార్థకమైన 'స్వామి వివేకానంద' అనే పేరును ధరించాడు. నూతన సన్న్యాసులలో వైరాగ్యం పెరుగ క్రమంగా వారందరూ పరివ్రాజకులై వివిధ పుణ్యక్షేత్రాలకు పోసాగారు. వివేకానందుడుకూడ కొంతకాలం అక్కడక్కడ సంచరించటానికి పోయినా తిరిగి మళ్ళీ మఠానికి వచ్చేవాడు. కాని క్రమంగా అతడిలో తీవ్రపరివ్రాజకేచ్ఛ ప్రజ్వలింప - ఒక అజ్ఞాతశక్తి భవిష్యత్ వేదాంత ప్రచారకుడిగా అతడికి కావలసిన అనుభవం కల్గించటానికిగాను తన్నావేశింప - 1890వ సంవత్సరం జూలైలో మఠాన్ని విడిచి సంచరించ ప్రారంభించాడు. తర్వాత ఆతడు మఠానికి తిరిగి వచ్చింది 1897వ సంవత్సరంలోనే, పాశ్చాత్యంలో వేదాంతభేరిని మోగించి విజయపతాకంతో తిరిగివచ్చిన తర్వాతనే.

## పరివ్రాజనం

బారానగర మఠాన్ని వీడిన తర్వాతనే వివేకానందుడు దాదాపు మూడేళ్ల పాటు దేశమంతా సంచరించాడు. కాశీ, బృందావనం, హిమాలయప్రాంతాలు, ఢిల్లీ, రాజస్థానం, గుజరాత్, మధ్యపరగణాలు, మహారాష్ట్రం, కర్ణాటకం, కేరళ, తమిళనాడు - అన్ని రాష్ట్రాలు సంచరించాడు. మహాత్ములతోను, సామాన్యుల

తోను, పండితులతోను, పామరులతోను, రాజామహారాజులతోను, దీనదరిద్రుల తోను, విద్యాధికులు, విద్యావిహీనులతోను - అందరితోను కలిసిమెలసి ఉంటూ వారి సంస్కృతి, సంప్రదాయాలను, ఆచారవ్యవహారాలను, జీవిత విధానాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, వారికి బోధిస్తూ, తాను ఎన్నో గుణపాఠాలు నేర్చు కుంటూ సంచరించాడు. ఒక్కొక్కప్పుడు ఆతడు మహారాజులు, దివానులు, పండితులచే ఎంతో ఆదరాప్యాయాలతో ఆదరింపబడేవాడు. కాని ఎక్కువకాలం బీదసాదలతోనే వసిస్తూ వారి కష్టసుఖాలనూ కనుగొంటూ వారి దుఃఖజీవనంలో పాలుపంచుకొంటూ ఉండేవాడు. ఈ పరివ్రాజకావస్థలో ఆహారం దొరకక పస్తున్న రోజులెన్నో. అత్యంత అపాయకర పరిస్థితులలో ఆతడెన్నోసార్లు రక్షింప బడ్డాడు భగవంతునిచే. ఈ పరివ్రాజకావస్థలో ఎన్నో విషయాలు అతనికి గోచ రించాయి. ధనవంతులకంటే బీదసాదల హృదయాలే ప్రేమ, సానుభూతులతో ఎలా నిండివున్నాయో ఎన్నోసార్లు అతడికి అనుభూతమైంది. ధనికులు దరిద్రు లను, అగ్రజాతులు నిమ్నజాతులను, విద్యావంతులు నిరక్షరపేదలను ఎటువంటి నీచదృష్టితో చూస్తూ, వారిని అసహనీయ బాధ పెట్టటం గమనించాడు. ఒకింత చదువుకున్నవారు గర్వాంధులై తమ సనాతన విలువలను విడిచి గుడ్డివారి లాగా పాశ్చాత్యసంస్కృతి, వర్తనాలను అనుకరించటానికి ప్రయత్నించటం చూశాడు. మతం పేరుతో, సత్వగుణం పేరుతో దేశమంతా తమస్సుచే కప్పు బడటం జనులు పనికిరానివారుగా మారటం గమనించాడు. మతం అంతా వంటింటిలోకి ప్రవేశించటం, స్థానీయ నమ్మకాలు, ఆచారాలు వేదానుశాస నాలుగా చలామణి కావటం కాంచాడు. విదేశీయులచే దాదాపు 10 శతాబ్దాల సుదీర్ఘకాలం పాలింపబడుతూ తమ వ్యక్తిత్వాన్ని దాదాపు మరచి, తాము బాని సలుగా జీవించటానికే పుట్టటం అని తలచే స్థితికి సామాన్య ప్రజలు దిగటం పరిశీలించాడు. ఆంగ్లేయులు మన దేశీయులను వర్ణనాతీతమైన బాధకు గురిపెట్టి దేశసంపదనంతా దోచుకొనిపోవటం గమనించాడు. సంక్షిప్తంగా మన సుదీర్ఘ చరి త్రలో మొదటిసారి మనదేశం ఇంత అధోగతికి దిగటం కాంచాడు. అలాగే పరి వ్రాజకదశలో ఒకరోజు ద్వారకలో ఉన్న శ్రీశంకరుల మఠంలో ధ్యానమగ్నులై అచిర భవిష్యత్తులో భారతదేశం ఇంతవరకు కని, విని, ఊహింపజాలనంత మహోజ్వలస్థితికి ఆరోహించటాన్ని కన్నాడు.

## జీవితకార్యాన్ని గుర్తించటం

ఇలా మూడు సంవత్సరాలు దేశసంచారం చేసి ఎన్నో అనుభవాలను సంత రించుకొని చివరకు కన్యాకుమారి చేరాడు వివేకానందుడు. జగన్మాత పాదాలకు

ప్రణమిల్లి, సముద్రంలో కాస్త దూరంలో ఉన్న శిల నెక్కి మూడు రోజులు గభీర ధ్యానస్థితిలో ఉండిపోయాడు. ఆ సమయంలో స్వాముల హృదయంలో ఉప్పొంగిన భావతరంగాలను ఊహించటం ఎవరికి సాధ్యం? ఐదువేల సంవత్స రాల భారతదేశపు గతచరిత్ర, ఈనాటి అధోగతి, పరివ్రాజకుడుగా తాను సంపా దించిన అనుభవాలు అతడి మనోఫలకం ముందు చిత్రపటంవలె సామరస్యంగా కన్పించసాగింది. ఫలితంగా కొన్ని అధ్యాత్మిక, ప్రాపంచిక సత్యాలు స్పష్ట మయ్యాయి అతడికి. మనదేశపు ప్రస్తుత అధోగతికి కారణాలు, తిరిగి అది గతం కంటే మహిమాన్వితం కావాలంటే చేయవలసిన కర్తవ్యం - ఇవన్నీ వారికి స్పష్ట మయ్యాయి. అన్నికంటే ముఖ్యం - వారు తానెందుకు జన్మించాడో, తమ జీవిత కార్యం ఏమిటో తెలుసుకున్నాడు.

సంక్షిప్తంగా అతడు కనుగొన్న సత్యా లివి:

1. భరతఖండం భౌగోళికంగా, భాషావిషయంగా ఎంత భిన్నంగా కన్పిం చినా సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా అది ఒక్కటే.

2. భారతదేశపు వెన్నెముక మతం, ఆధ్యాత్మికత. దీని ద్వారానే దేశం ఏ రంగంలోనైనా అభివృద్ధి చెందగలదు.

3. మన అవనతికి ముఖ్యకారణాలు i. మతాన్ని నిర్లక్ష్యం చేయుటం ii. మతం పేరుతో దేశమంతా తమోగ్రస్తం కావటం iii. తన అమూల్య ఆధ్యా త్మిక సంపదనుంచి వంచితులను చేసి జనసామాన్యాన్ని స్త్రీలను శతాబ్దాలుగా నిర్ల క్ష్యంచేస్తూ రావటం iv. భౌతిక దుర్బలత్వం.

4. విదేశీయులను 'మ్లేచ్ఛు'లుగా, హీనులుగా భావించి వారితో సాంగత్యం పెట్టుకోకుండా ఉండటం.

ఇక భారతదేశ పురోగమనానికి సూచనలు:

5. ప్రస్తుతం మనదేశానికి అత్యావశ్యకాలైనవి i. మొదట తగినంత పౌష్టి కాహారం ii. అన్నివిధాలైన ప్రాపంచిక ఔన్నత్యం. సరైన విద్యద్వారా, పారిశ్రామిక విద్యాభివృద్ధి ద్వారానే ఇది సంభవం. దీనికి కావలసిన విజ్ఞానాన్ని మనం పాశ్చా త్యులనుంచి నేర్చుకోవాలి.

6. సమగ్ర ప్రపంచాభివృద్ధిలో ప్రతి ఒక్క దేశానికి ఒక ప్రత్యేక కర్తవ్యం ఉంటుంది. ఏ దేశం ఈ కర్తవ్యాన్ని నెరవేర్చజాలదో ఆ దేశాన్ని ప్రకృతే పరి మార్చుతుందని ప్రపంచచరిత్ర స్పష్టం చేస్తూన్నది. ప్రపంచానికి ఆధ్యాత్మికావ దానం చేయటమే మొదటినుంచి భారతదేశపు పాత్రగా కనపడుతోంది. ఈ కర్త వ్యాన్ని నిర్లక్ష్యం చేయటం ఈ దేశపు అవనతి కొక కారణం. ఇప్పుడది మళ్ళీ తన పాత్రను మహోత్సాహంతో నిర్వహించటంలోనే తన భవిష్యదున్నతి సంభవం.

7. భారతీయ ఈ ఆధ్యాత్మిక సంపదను ప్రపంచాని కందివ్వటంలో తనదే ముఖ్యపాత్ర. ఈ మహాకార్యాన్ని నెరవేర్చటానికే భగవదిచ్ఛతో తాను జన్మించానని స్వామి గ్రహించాడు.

ఈ సత్యాలను కనుగొన్నాక స్వాములు మద్రాసుకు బయలుదేరారు. తన పరివ్రాజక కాలంలో అమెరికాలో ఒక మతమహాసభ జరుగనున్నదనీ, ప్రపంచం లోని ప్రతి మత, మతశాఖల ప్రతినిధులు ఆ సభకు ఆహ్వానింపబడుతున్నారని స్వామి విన్నాడు. గురుదేవుల మహాసందేశాన్ని వెదజల్లటానికి ఇంతకంటే మంచి అవకాశం ఎక్కడ దొరుకుతుంది? నిజాని కీ సభ శ్రీరామకృష్ణుల ఉపదేశాలను ప్రచారం చేయగలందులకే భగవదిచ్ఛతో ఏర్పాటు చేయబడుతున్నదని స్వామి అంతరం గ్రహించింది.

మద్రాసులో స్వామి వలన ఆకర్షితులై ఎందరో భక్తులు, శిష్యులు అయ్యారు. కొంతకాలం తర్వాత వారందరూ కలసి స్వామి ప్రయాణపు ఖర్చు లకై చందా వసూలుచేసి దాదాపు నాలుగువేల రూపాయలు పోగుచేశారు. ఈ మధ్యలో స్వామి ఒకసారి హైద్రాబాదుకు పోయి, 'నా జీవితకార్యం' అనే చక్కని ఉపన్యాసం ఇచ్చి తిరిగివచ్చాడు. తర్వాత తన శిష్యుడైన ఖేత్రీమహారాజు ఆహ్వానం మీద ఖేత్రీకి వెళ్ళి, కొన్ని రోజు లక్కడుండి బొంబాయికి వచ్చాడు. మహారాజు స్వాములకోసం తగిన దుస్తులు, మొదటి తరగతి టిక్కెట్టు, కొంతపైకం గురుదక్షిణగా బహూకరించాడు. వివేకానందుడు 1893 వ సంవత్సరం మే నెల 31వ తేదీన 'పెనిస్స్యులర్' అనే ఓడ నెక్కి అమెరికాకు ప్రయాణమయ్యాడు.

## పాశ్చాత్యాగమనం

దారిలో కొలంబో, సింగపూర్, చైనా, జపానులను దర్శించి జూలై నెల 30వ తేదీన మహాసభ జరుగనున్న షికాగో నగరాన్ని చేరాడు స్వామీజీ.

## విశ్వమత మహాసభ, అమెరికాలో తొలిరోజులు

కొలంబసు 400 సంవత్సరాల క్రితం అమెరికాను కనుగొన్నాడు. ఈ కాలంలో అమెరికా ఉన్నతిని పొందింది. ఈ సందర్భంగా ఒక ఎత్తులో ఉత్సవం జరపటానికి నిర్ణయించుకున్నారు అమెరికన్లు. మానవ ప్రగతికి సహకరించిన విజ్ఞానం, కళ, సాహిత్యం - ఇత్యాది అన్ని రంగాలలోని అత్యుత్తమైన వాటిన న్నిటినీ సేకరించి, వాటి నొకచోట ప్రదర్శించటానికి పెద్ద ఏర్పాటు చేశారు. ఇదే 'విశ్వప్రదర్శనం' (world fair). మానవ ప్రగతికి 'మతం' కూడ ఎంతో

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2324**

* * *